క్లుప్తంగా

15100కు ఫోన్ చేస్తే న్యాయ సహాయం



బ్లైండ్ విద్యార్థులతో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు (టూటౌన్): న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబరు 15100ను వినియోగించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక వెంకటాపురంలోని ఎలీషా బ్లైండ్ హోమ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, రక్షణ, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు లేదా ఏ ఇతర సౌకర్యాలపై సమస్య ఏర్పడినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, వారి వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలు ఉన్నా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హోమ్ మేనేజర్ రాజశేఖర్, అంధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



సుబ్బమ్మ దేవి స్కూల్‌లో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, పీఎఫ్ సమస్య త్వరలో పరిష్కారం కానుందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఆయన మంగళవారం నగరంలోని పలు నగరపాలక పాఠశాలలను సందర్శించారు. తనను ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలపై ఆరా తీశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ, కోశాధికారి రంగమోహన్, జిల్లా మునిసిపల్ కన్వీనర్, జిల్లా కార్యదర్శి ఈడే శివ శంకరరావు, నగర ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిశుభ్రతకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిటు అధికారి వై.వి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం కాగుపాడులో ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. లార్వా దశలోనే దోమను అంతం చేయాలని తెలిపారు. కాగుపాడు ఆసుపత్రి సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాసరావు,అంగన్‌వాడి కార్యకర్తలు రత్నకుమారి, విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రవికుమార్

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దార్‌గా పాలపర్తి రవికుమార్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమం విభాగంలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్నారు. బుధవారం ఉంగుటూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. డీటీ ప్రాణ చంద్రప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు రక్షణ ఎక్కడ?

- పేరుకే అభయ టీములు
- బాధితుల గగ్గోలు



ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా, బాలికల రక్షణకు అవగాహన ప్రదర్శనలు



కళాశాలలో శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థినులు

ఏలూరు టౌన్: 'ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన బాలికను తల్లిదండ్రులు మందలించటంతో కోపంతో ఏలూరు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. అర్ధరాత్రి వేళ ఒంటరిగా దిగాలుగా కూర్చుని ఉండటాన్ని ఒక ఆటో డ్రైవర్ గమనించాడు. బాలికకు మాయమాటలు చెప్పి మీ ఇంటికి తీసుకెళతానని చెప్పాడు. ఆటోలో బాలికను బలవంతంగా ఏలూరు చిరంజీవి బస్టాండ్ సమీపంలోని మరో ఆటో డ్రైవర్ ఇంటికి తీసుకెళ్లాడు. రాత్రివేళ బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉండగా, బాలిక భయంతో కేకలు వేస్తూ అతడి నుంచి తప్పించుకుని పారిపోయి రోడ్డుపైకి వచ్చింది. అటుగా వెళుతూ గుర్తించిన హిజ్రాలు బాలికను అతడి బారినుంచి రక్షించారు. తల్లిదండ్రుల సమాచారం తెలుసుకుని బాలికను వారికి అప్పగించారు. హిజ్రాలు సమయానికి అక్కడ లేకుంటే బాలిక పరిస్థితి ఏమిటనేది అర్థంచేసుకోవచ్చు.'

'ఏలూరు శివారు దుగ్గిరాల గ్రామానికి చెందిన ఒక బాలికను అదే ప్రాంతానికి చెందిన ఒక యువకుడు ప్రేమిస్తున్నానంటూ నిత్యం వెంటపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. టెన్త్ పరీక్షలకు వెళ్లటానికి సైతం బాలిక భయపడే పరిస్థితి ఏర్పడింది. దీనిపై బాలిక తండ్రి, అన్న ఏలూరు జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దిశ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీస్ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధిత కుటుంబం వాపోతుంది. ప్రజా ఫిర్యాదుల వేదికలో వినతి పత్రం అందజేసినా పట్టించుకున్న నాధుడే లేడంటున్నారు. నేరం జరిగాక.. బాలికపై దాడి చేశాక కానీ పోలీసులు చర్యలు తీసుకోరా ? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి.'

అంతా హడావుడే?

ఏలూరు నగరంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అభయ పోలీస్ మహిళా రక్షక దళం బృందాలు రోడ్లపై తిరుగుతూ మహిళలు, యువతులు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నాయి. కళాశాలలు, పాఠశాలలు, పార్కులు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో అభయ టీములు వెళుతూ బాలికలకు రక్షణగా నిలుస్తున్నామని వివరిస్తున్నాయి. మహిళల రక్షణకు సంబంధించి తాము చేపట్టే చర్యలను ప్రదర్శిస్తూ ప్రత్యేకంగా ప్రచార రథాన్ని సైతం రోడ్లపైనా, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల ప్రాంతాలు, గ్రామాల్లో తిప్పుతూ ప్రచారం చేస్తున్నారు. కానీ ఏలూరు నగరంలో బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులు, కిడ్నాప్‌లు కొనసాగుతునే ఉన్నాయి. అయినా పట్టించుకునే ఖాకీ లేకపోవటం గమనార్హం. మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు హడావుడి తప్ప తీసుకునే చర్యలు శూన్యమనే విమర్శలు ఉన్నాయి. బాలికలపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయటం మినహా... బాధితులకు న్యాయం జరిగడంలేదని వాపోతున్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తులకు భయం లేకుండా పోతుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే రక్షణ

వైఎస్సార్ సీపీ హయాంలో దిశ యాప్‌ను రూపొందించి సమర్థవంతంగా అమలు చేసి చూపించారు. ఏలూరు నగరంలోనే సుమారుగా 15 వేలకు పైగా మహిళల ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించటంతోపాటు, 10 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు చేయించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులపై వేధింపులకు పాల్పడాలంటే భయపడేలా గతంలో పోలీస్ అధికారులు సీరియస్ యాక్షన్ ఉంది. దిశ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే చాలు 10 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి పోలీస్ సిబ్బంది చేరుకునేవారు. కానీ నేడు పేరుకే మహిళా రక్షణ తప్ప, మహిళలు, బాలికలకు రక్షణ కరువైందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఎంత హెచ్చరించినా సిబ్బందిలో మాత్రం మార్పు శూన్యమంటున్నారు.

నేరాలకు పాల్పడితే ఉపేక్షించం



ఏలూరు నగరంలో మహిళలు, బాలికల రక్షణకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ నేతృత్వంలో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాం. వారి భద్రతకు పెద్దపీట వేస్తూ అభయ రక్షక దళాలు, శక్తి యాప్ అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎవరైనా బాలికలు, యువతులను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదు. కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తాం. ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.

– డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ

ఉపాధి హామీ పథకంలో నీటి తొట్టెల నిర్మాణం



పశువుల తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు: ఏలూరు మండలం మాదేపల్లి పంచాయతీ లింగారావుగూడెంలో ఉపాధి హామీ పథకంలో పశువుల తొట్టె నిర్మాణానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం శంకుస్థాపన చేశారు. పశువులకు తాగునీరు అందించేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా రూ.33 వేలు అంచనాలతో చేపట్టిన ఈ పనులను వారంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పశువుల తొట్టె నిర్మాణంతో లింగారావుగూడెంలో సుమారు 300 పశువులకు తాగునీటి సౌకర్యం ఏర్పడుతుందని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాలో 411 పశువుల నీటి తొట్టెలు నిర్మించనున్నట్టు తెలిపారు. వీటిని 10 రోజుల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు, ప్రోగ్రామ్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పశు సంవర్ధకశాఖ సమన్వయంతో నీటి వసతి ఉన్న ప్రదేశాల్లో 6,600 లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో తొట్టెలు నిర్మిస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ కె.వెంకట సుబ్బారావు, ఆర్‌డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీలత, దెందులూరు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కె.రఘురామయ్య తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ద్వారకాతిరుమల: నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు



చింతలపూడి: కమిషనర్ పావనికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల: ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లి, ద్వారకాతిరుమల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటినా సంక్షేమ బోర్డును ఎందుకు పునరుద్ధరించలేదని, వాడుకున్న డబ్బును ఎందుకు జమ చేయలేదని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం మర్చిపోవడం రివాజుగా మారిందని ఆయన విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక వలసలు వెళుతున్నారని, తక్షణమే గృహ నిర్మాణ పథకం ద్వారా పేదలకు గృహాలు మంజూరు చేసి, కార్మికులకు పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, ప్రతాప్, బండారు శివాజీ, ఆది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలి

చింతలపూడి: ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్)ను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల జీవితాలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం నగర పంచాయితీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నత్త వెంకటేశ్వరరావు, తానంకి విజయరాజు, వెలగాడి పద్మ, షేక్ సలీం, సోమయ్య, లావేటి వంశీ, బొచ్చ కష్ణ, ఆర్.ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రహదారిపై ఏర్పడిన గొయ్యి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన లంకాలపల్లి నుంచి రేపల్లె వెళ్లే రహదారి మలుపు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షాలకు మలుపు సమీపంలో ఉన్న కల్వర్టుకు పెద్ద గొయ్యి ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. రేపల్లె, రేగులపాడు, మోదేలు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చే గిరిజనులు చూసుకోకుండా వాహనాలను నడిపితే ఆ గోతిలో పడే ప్రమాదం ఉంది. అలాగే పలువురు వ్యవసాయ రైతులు కూడా ఈ రహదారిపై ప్రయాణిస్తుంటారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా అధికారులు వెంటనే ఈ గొయ్యిని పూడ్చాలని గిరిజనులు కోరుతున్నారు.

13న విద్యార్థులతో చర్చా వేదిక



పోటీల కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్‌ల జయంతిని పురస్కరించుకుని పూలే, అంబేడ్కర్ ఆలోచనా విధానంపై ఈ నెల 13న సర్ సీఆర్ రెడ్డి బీఈడీ కాలేజీలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే విద్యార్థులతో చర్చా వేదిక నిర్వహించనున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్‌ను మంగళవారం స్థానిక అన్నే భవన్‌లో ఆయన విడుదల చేశారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్, మానవత, కేవీపీఎస్, బోంసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలో పాల్గొనే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా సెల్ నెంబర్లు 94419 75257, 95150 27023, 94900 98559లో వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. 13న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గాయనీ గాయకులచే సావిత్రిబాయి పూలే అంబేడ్కర్ గురించిన ప్రబోధాత్మక సందేశాత్మక పాటలు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. విజేతలకు ప్రశంసా పత్రం, మెమెంటోతో సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యక్రమ కోకన్వీనర్లు జి.రాంబాబు జి.సీలిమ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు కె.శ్రావణ కుమారి, కె.జనని, దేవరకొండ లలిత, ఎం సాయి సిద్ధార్థ, డి.విజ్ఞాన్ పాల్గొన్నారు.

ఈసారీ కందిపప్పు కట్

- పూర్తిగా ఎగ్గొడతారేమోనని లబ్ధిదారుల్లో ఆందోళన
- ఉగాది, రంజాన్ పండుగ నెలలో సైతం ఇవ్వకపోవడంపై కార్డుదారుల ఆగ్రహం

దెందులూరు: కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ఇచ్చే కందిపప్పును కట్ చేసింది. రెండు నెలలుగా దెందులూరు నియోజకవర్గంలో కందిపప్పు ఇవ్వటం లేదు. కూటమి నేతలు అధికారంలోకి వస్తే తోఫా ఇస్తాం... సంక్రాంతి కానుకలు ఇస్తామని చెప్పినచోట చెప్పకుండా చెప్పినవి చెప్పకుండా ఇష్టం వచ్చినట్టు ప్రచారం చేశారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ హామీలతో పాటు కందిపప్పును కూడా ఇవ్వకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి నెల పూర్తిగా ఇవ్వలేదు. ఈ నెలలో కూడా గోదాములోకి ఇంకా సరుకు రాకపోవడంతో ఈ నెల కూడా ఇస్తారా లేదా అన్న అనుమానం ఏర్పడింది. మార్చిలో వచ్చిన ఉగాది రంజాన్ పండుగలకు కందిపప్పు కలగానే మిగిలింది. కందిపప్పు కూడా ఇవ్వలేకపోతే ప్రజలకు ఏం చేస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు రేషన్ షాపుల్లో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురు చూస్తుంటారు. బయటి మార్కెట్లో పేదలు కందిపప్పు కొనలేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పండుగ నెలలో పప్పన్నం తీరని కలగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం ఇస్తుందో ఇవ్వదు తెలియదు కందిపప్పు గోదాములకు వస్తుందో రాదో తెలియదు నాయకులు చెప్పే మాటలకు చేసే వాగ్దానాలను గ్రామాల్లో జరిగే పనులకు పొంతన లేకుండా పోతుందని వృద్ధులు, మహిళలు ఎద్దేవా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వస్తుంది మీ కష్టాలు తీరిపోతాయని మూడు పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరకపోగా ప్రశ్నించే నాయకుడు ఒక్కడు కూడా మూడు పార్టీల్లో కనపడకపోతే ఎలాగని ప్రజల సంగతి ఏమిటని ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు కేవలం కోట్లు కోసమే అన్నది క్రమేపి తమకు అర్థమవుతుందని నియోజవర్గంలో గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు అంటున్నారు.

నియోజకవర్గం వారీగా కార్డుదారులు

దెందులూరు	21600 రేషన్‌కార్డులు
పెదపాడు	21300 రేషన్ కార్డులు
పెదగి	29,431 రేషన్ కార్డులు
ఏలూరు రూరల్	21,300 రేషన్ కార్డులు

వారం రోజుల్లో ఇవ్వాలి



వారం రోజుల్లో కందిపప్పు మూడు నెలలది ఇవ్వాల్సిందే. సూపర్ సిక్స్ హామీలను అడగటం లేదు. తినటానికి కందిపప్పు కూడా ఇవ్వాలన్న మనసు లేకపోవడం దుర్మార్గం. పేదల ప్రభుత్వం అంటే ఇదేనా పేదలకు అండగా ఉంటానన్నారు ఇలాగేనా. కందిపప్పును కూడా ఎగ్గొడితే ఊరుకోబోమని న్యాయపోరాటం చేస్తామన్నారు.

–కట్టా ఏసుబాబు
వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

నిర్వాసితుల త్యాగాలతోనే పోలవరం ప్రాజెక్ట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

పోలవరం రూరల్: వేల కుటుంబాల త్యాగాల ఫలితంగానే రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాకారమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండలంలోని వేలేరుపాడు, సుద్దగుంపు, జగన్నాథపురం, మల్లారం, భూదేవిపేట, రామవరం, ఇప్పలగుంపు తదితర గ్రామాల్లో శత జయంతి వేడుకల్లో భాగంగా సీపీఐ చేపట్టిన ప్రచార జాత రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య నిర్వాసితులకు కుంటి సాకులు చూపించకుండా నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఆలస్యం చేయకుండా ముంపు గ్రామాలన్నిటినీ పునరావస ప్రాంతాలకు తరలించాలన్నారు. అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునిర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, వసంతరావు, సన్నేపల్లి సాయిబాబు, బాడిశ రాము, డి.శివకుమార్, కురిమల వెంకటేశ్వర్లు, పిట్టా వీరయ్య, తాటి దుర్గారావు, బంధం నాగేశ్వరావు, కంగాల గంగరాజు, భీమరాజు, సోడే ప్రసాద్, సోడే సత్తిబాబు, బంధం పెద్ద నాగేశ్వరావు, సోడే కన్నారావు, పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఈసీఐఎల్)(ఇంద్ర)	21.30	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	06
~~ఏలూరు – తిరుపతి(ఇంద్ర)~~	~~19.00~~	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు –తిరుపతి	16.00	4830	34

దరఖాస్తుదారులకు నేడు ముఖాముఖి

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ దెందులూరు, దోసపాడు, కొవ్వలి, పోతునూరు, సానిగూడెం గ్రామాల్లో రుణాల కోసం దరఖాస్తు చేసినవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, అప్లికేషన్, బ్యాంకు బుక్‌తో ఇంటర్వ్యూకు రావాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాల్లో దరఖాస్తు చేసిన వారు గురువారం ఇంటర్వ్యూకు హాజరుకావాలని అన్నారు.

నేడు అన్న సమారాధన

దెందులూరు: మండలంలోని కొవ్వలిలోని అంకమ్మ తల్లి సంబరాలు ముగింపు సందర్భంగా బుధవారం మహా అన్న సమారాధన జరుగుతుందని కొవ్వలి రజక సంఘం అధ్యక్షుడు గోవాడ నాగరాజు, సెక్రటరీ గోవాడ శ్రీనివాసరావు, క్యాషియర్ గొల్లపూడి రమేష్, శ్రీను జాయింట్ సెక్రటరీ గోవాడ దుర్గారావు అన్నారు.

జల్లేరు స్పిల్‌వేకు మరమ్మతులు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం మరమ్మతు పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. సుమారు రూ.8 లక్షల 42 వేలతో స్పిల్‌వే గేట్ల మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా జనరేటర్ మెయింటెనెన్స్‌కు సుమారు రూ.3 లక్షలు మంజూరైనట్లు ఇరిగేషన్ ఏఈ టి.సురేష్ తెలిపారు. అదే విధంగా పెద్ద వాగు ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రా పరిధిలోని వేలేరుపాడు మండలంలో కాలువల పూడుక తీత పనులు చేపట్టేందుకు రూ.44 లక్షల 36 వేలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అదే విధంగా పోలవరం మండలంలోని మంగవతీ దేవీపేట పరిధిలో పనులు చేపట్టేందుకు రూ.8 లక్షల 60 వేలు మంజూరైనట్లు చెప్పారు. త్వరలోనే ఆ పనులు కూడా చేపడతామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఉంగుటూరు: గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మారాజు అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలంలో పలు గ్రామాల్లో 1 కోటి 93 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మారాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారన్నారు. నల్లమాడులో రూ.5లక్షలతో వ్యయంతో నిర్మించిన సీసీ రహదారి, యర్రమల్లిపాడులో రూ.17.50 లక్షలు వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని, కంసాలిగుంటలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారి, ఎ.గోకవరంలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని రహదార్లను ప్రారంభించారు.